క్లుప్తంగా

పిచ్చి కంప తొలగింపు



కంకిపాడు: విద్యుత్ స్తంభాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా విద్యుత్ స్తంభాల చుట్టూ పెరిగిన పిచ్చికంప, తీగజాతి మొక్కలను తొలగించే పనులను రెండు రోజులుగా నిర్వహిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది పిచ్చి మొక్కల తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు. పనులను ఆ శాఖ ఏఈ టి. అశోక్ కుమార్ పర్యవేక్షించారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

పెనమలూరు: ఒక వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ కథనం మేరకు.. గోసాల వైకుంఠపురంలో గోవాడ శివ కుమారి కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె స్థానిక పాఠశాలలో వంట పని చేస్తుంది. ఆమె కుమారుడు గోవాడ అనీల్‌కుమార్ కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. అతని భార్య నాగమణితో అతనికి తరచుగా గొడవలు జరుగుతున్నాయి. కాగా అతను ఈనెల 16వ తేదీన మద్యం సేవించి రాగా భార్య నాగమణితో గొడవ జరిగింది. దీంతో అతను ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చెత్త సేకరణ వాహనం ప్రారంభం



గన్నవరం: మండలంలోని గన్నవరం, కేసరపల్లి, బుద్దవరం గ్రామ పంచాయతీల సంయుక్త నిధులు రూ. 54 లక్షలతో కొనుగోలు చేసిన చెత్త సేకరణ వాహనం సోమవారం అందుబాటులోకి వచ్చింది. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాహనాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ గ్రామ పంచాయతీల్లో చెత్త డంపింగ్ యార్డులు లేకపోవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. దీంతో రోడ్ల వెంబడి చెత్త డంపింగ్ చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మూడు గ్రామ పంచాయతీలు కలిసి చెత్త సేకరణ వాహనాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి అరుణ, సర్పంచ్‌లు నిడమర్తి సౌజన్య, చేబ్రోలు లక్ష్మీమౌనిక, బడుగు బాలమ్మ, ఎంపీడీఓ స్వర్ణలత, పలువురు ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం 6.30 గంటలకు రుద్రాభిషేకం జరిగింది. ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి పంచహారతులు ఇచ్చి పల్లకీసేవ చేశారు. అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు.

సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చేపట్టిన సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలని కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలం పన్ను, నీటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, ప్రకటనల పన్నులపై తమ సిబ్బంది ఇంటింటికి వచ్చి సర్వే చేస్తారన్నారు. యజమానులు ఆధార్, మొబైల్ నెంబర్, పన్నుల వివరాలు, భవనం ప్లాన్, కమర్షియల్ భవనాల లైసెన్సు, కరెంట్ మీటర్ నెంబర్ సిబ్బందికి తెలపాలని అన్నారు. అలాగే భవనాల కొలతలు కూడా సేకరిస్తారని తెలిపారు. పన్నులతో వచ్చిన ఆదాయంతో రోడ్లు, డ్రెయినేజీ, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, సిబ్బందికి జీతాలు చెల్లిస్తామని, ప్రజలు సహకరించాలని కమిషనర్ భవానీప్రసాద్ కోరారు.



అన్నదాతను వదలని విపత్తు

- చిరుపొట్ట, పాలు పోసుకునే దశలో వరి చేలు
- వర్షాలతో దిగుబడులు తగ్గుతాయంటున్న రైతులు

విడవకుండా కురుస్తున్న వర్షాలు

కంకిపాడు: అన్నదాతలను విపత్తులు వదలడం లేదు. మొన్నటి వరకూ కృష్ణానది, బుడమేరు వరద ఉధృతితో పంట పొలాలు దెబ్బతిన్నాయి. పంటపై పెట్టిన పెట్టుబడులు కోల్పోయి రైతులు ఆర్థికంగా నష్టాన్ని చవిచూశారు. ఆ తరువాత అల్పపీడన ప్రభావంతో తరచూ కురుస్తున్న వర్షాలు వరిపైరు దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాజిల్లా వ్యాప్తంగా 25 మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 1.51 లక్షల హెక్టార్లలో రైతులు వరి సాగు చేపట్టారు. తొలకరి రాకతో సాగు చేపట్టిన మండలాల్లో వరి పైర్లు దుబ్బులు చేసి చిరుపొట్ట, కంకులు పాలు పోసుకునే దశలో ఉన్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో వరి దుబ్బు దశకు చేరుతోంది.

వరదలతో అపార నష్టం

ఇటీవల కృష్ణానదికి ఎన్నడూ లేని విధంగా 11.42 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. దీనికి తోడు బుడమేరు ఉగ్రరూపంతో పంట పొలాలు ముంపునకు గురై దెబ్బతిన్నాయి. జిల్లా వ్యాప్తంగా 48,641 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేయటం తెలిసిందే. ఇందులో వరి పంట సుమారుగా 44,521 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. చివరికి కేవలం 22 వేల హెక్టార్లలో మాత్రమే పంట నష్టం వాటిల్లిందంటూ నష్టపరిహారం విషయంలోనూ భారీగా కోత విధించటంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు.



చిరుపొట్ట దశలో వరి పైరు

తొలకరి వర్షాలతో సాగు ఆరంభించిన గన్నవరం, పెనమలూరు, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ప్రస్తుతం వరి పైర్లు చిరుపొట్ట, కంకులు పాలు పోసుకునే దశలో ఉన్నాయి. మిగతా ప్రాంతాల్లో వరి దుబ్బు దశకు చేరుతోంది. కంకిపాడు, పెనమలూరు మండలాల్లో వరి కంకులు గట్టిపడే దశలో ఉన్నాయి. ఇప్పటికే ఎకరాకు ఒక్కో రైతు రూ.25 వేలు వరకూ పెట్టుబడులు పెట్టారు. పంట చేతికి వచ్చేందుకు సిద్ధమవుతుండటంతో జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియకు సన్నాహాలు చేస్తోంది. నవంబరు మొదటి, రెండో వారాల్లో ధాన్యం సేకరణ జరిగేలా కార్యాచరణ చేపట్టారు.

వర్షాలతో బెంబేలు

వరదలు, భారీ వరాల నుంచి తేరుకుంటున్న రైతులు సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు. పైర్లు చిరుపొట్ట, కంకులు పాలు పోసుకునే దశలో ఉన్న పరిస్థితుల్లో అల్పపీడన ప్రభావంతో విడవకుండా వర్షాలు పడుతున్నాయి. రోజులో ఏదో ఒక పూట మోస్తరు నుంచి భారీ వర్షం పడుతోంది. వర్షాలతో సుంకు రాలిపోతుందని, తాలు, తప్ప ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కంకులు మానుగాయ వేస్తుండటంతో పంట నాణ్యతపై ప్రభావం చూపుతుందని వాపోతున్నారు. దిగుబడులకు సిద్ధమవుతున్న తరుణంలో వర్షాలు పడటంతో దిగుబడులు ఏ మేరకు చేతికి అందుతా యోనన్న భయం రైతుల్లో నెలకొంది. వర్షాలు కొనసాగితే ఎకరాకు ఐదు నుంచి ఏడు బస్తాల వరకూ దిగుబడుల్లో వ్యత్యాసం వస్తుందని ఆందోళన చెందుతున్నారు.

దిగుబడులపై ప్రభావం



పంట చేతికి వచ్చే తరుణం ఇది. ఈ సమయంలో వర్షాలు పడుతున్నాయి. కంకులు మానుగాయ వేస్తున్నాయి. తాలు, తప్ప వచ్చే అవకాశం ఉంది. దిగుబడులుపై ప్రభావం చూపుతుంది. అయితే వర్షాలుపడ్డ వెంటనే ఎండ కాస్తుండటంతో ప్రభావం తగ్గుతుందని భావిస్తున్నాం. వర్షాలు మాత్రం విడవకుండా పడుతున్నాయి.

– ఎం.సాంబశివరావు, కౌలురైతు, దావులూరు

దుబ్బుశాతం దెబ్బతింది



గ్రామంలో 15 ఎకరాలు వరకూ కౌలు చేస్తున్నా. మొన్న కురిసిన భారీ వర్షాలకు దుబ్బు శాతం దెబ్బతింది. ప్రస్తుతం పొలాలు చిరుపొట్ట, కంకులు దశలో ఉన్నాయి. ఇప్పుడేమో వానలు వదలటం లేదు. పొలాల్లో దోమ పోటుంది. అయితే తాలు, తప్ప వస్తుంది. ఎకరాకు ఐదు నుంచి ఏడు బస్తాలకుపైగా దిగుబడి పడిపోయే ప్రమాదం ఉంది. ఈ వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి.

– నకరికంటి శేఖర్, కౌలురైతు, ఈడుపుగల్లు



హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ-2గా లక్ష్మీనరసింహ మూర్తి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ-2గా ఎస్. లక్ష్మీనరసింహ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో రెండో సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్ ఖాళీగా ఉండటంతో ఆ స్థానంలో లక్ష్మీనరసింహ మూర్తిని నియమించారు. గుడివాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా పని చేస్తున్న ఆయన బదిలీపై వచ్చారు.

అయానాకు అరుదైన పురస్కారాలు

కంకిపాడు: అయానా ఫంక్షన్, కన్వెన్షన్ సెంటర్‌కు అరుదైన పురస్కారాలు లభించాయని ఆ సంస్థ చైర్మన్ మనోజ్‌కుమార్, ఎండీ రాజశేఖర్ తెలిపారు. సోమవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. వరల్డ్ స్టాండర్డ్ వీక్ పురస్కరించుకుని హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అయానాకు ఫైవ్ స్టార్ సర్టిఫికేషన్ అవార్డును ప్రకటించిందన్నారు. ఈ అవార్డును మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రణాళిక నిర్వహణ, ఆహార భద్రత, పరిశుభ్రత, సౌరశక్తి ఉత్పత్తి, నీటి శుద్ధీకరణ తదితర అంశాలకు సంబంధించి ఫైవ్‌స్టార్ సర్టిఫికేషన్ అవార్డు దక్కిందన్నారు. ఐఎస్‌ఓ 9001–2018, ఐఎస్‌ఓ 14001–2015, ఐఎస్‌ఓ 22000–2018 సర్టిఫికెట్లు దక్కాయని వివరించారు.

నోటుపుస్తకాల పంపిణీ

పాయకాపురం(విజయవాడరూరల్): వరద ప్రభావిత ప్రాంతాల్లోని హైస్కూల్స్ విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సోమవారం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. వివిజయవాడ 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌లో 700 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 6 నోటు పుస్తకాలను మానవత సంస్థ ప్రతినిధులు ఉచితంగా పంపిణీ చేశారు. 64వ డివిజన్ కండ్రికలోని బీవీ సుబ్బారెడ్డి మున్సిపల్ హైస్కూల్‌లో 600 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా కోశాధికారి జె.వీరవెంకట సత్యనారాయణ, అమరావతి బాలోత్సవ్ అధ్యక్షులు పి.మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ మైనం హుస్సేన్, కె.వి. దుర్గారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లే టార్గెట్

- ఇప్పటికే జనాలపై పన్నుల భారం
- ప్రజలకు అందని సమగ్రపాలన
- తాడిగడప మున్సిపాలిటీలో అభివృద్ధి-సంక్షేమం నిల్
- సర్వే చేయడానికి రంగంలోకి దిగిన సిబ్బంది



తాడిగడప మున్సిపాలిటీలో బహుళ అంతస్తుల భవనాలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పాలన అంతంత మాత్రంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్న మున్సిపాలిటీ ప్రజలకు త్వరలో పన్నుల మోత మోగనుంది. మున్సిపాలిటీ ఆదాయం పెంచడానికి ఇప్పుడు ఉన్న పన్నులు సమగ్ర సర్వే పేరుతో పెంచి ప్రజలపై భారం వేసే పనిలో పడ్డారు. సమగ్ర సర్వే చేయడానికి సిబ్బందిని రంగంలోకి దించారు. దాదాపు 163 మంది సిబ్బంది ప్రతి ఇంటికీ తిరిగి సర్వే చేసి వివరాలు సేకరించనున్నారు. వివరాల్లోకి వెళితే.. తాడిగడప మున్సిపాలిటీ 2020 సంవత్సరంలో ఆవిర్భవించింది. తాడిగడప, కానూరు, యనమలకుదురు, పోరంకి గ్రామాలను విలీనం చేసి తాడిగడప మున్సిపాలిటీగా రూపొందించారు. మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత నాలుగు గ్రామ పంచాయతీలకు సంబంధించి రికార్డులు, ఇళ్ల వివరాలు (అసెస్‌మెంట్‌లు), పన్నుల వివరాలు మున్సిపాలిటీకి చేరాయి. అప్పటి నుంచి తాడిగడప మున్సిపాలిటీ పన్నులు వసూళు చేస్తోంది. అయితే తాజాగా కమిషనర్ భవానీప్రసాద్ తాడిగడప మున్సిపాలిటీలో ఇంటి పన్నులు సక్రమంగా ఉన్నాయా లేదా? పన్నులు లేని ఇళ్ల వివరాలు, అక్రమ కుళాయి కనెక్షన్‌ల వివరాలపై సర్వే చేయాలని ఆదేశించారు.

రంగంలోకి దిగిన 163 మంది సిబ్బంది

సమగ్ర సర్వే చేసి పన్నుల వసూళ్లే లక్ష్యంగా 163 మంది సిబ్బంది రంగంలోకి దిగారు. తాడిగడప మున్సిపాలిటీలోని 19 సచివాలయాల్లో పని చేస్తున్న 97 మంది, కంకిపాడు, పెనమలూరు మండలాల్లోని గ్రామ పంచాయతీల నుంచి 47 మంది సిబ్బంది, నోడల్ అధికారులు 19 మంది కలిపి 163 సోమవారం నుంచి సర్వే చేపట్టారు. వీరు ప్రతి ఇంటికీ వెళ్లి ఇళ్ల కొలతలు సేకరిస్తున్నారు. ఇంటి పన్ను, కుళాయి కనెక్షన్ తనిఖీ చేస్తున్నారు.

స్థానికుల్లో ఆందోళన

కాగా మున్సిపాలిటీ అధికారులు చేపట్టిన సర్వేపై ప్రజల్లో వ్యతిరేకత కనబడుతోంది. గ్రామ పంచాయతీలు ఉన్నకాలంలోని వివిధ రకాల పన్నులు మున్సిపాలిటీ ఏర్పడిన తర్వాత మార్పులు చేసి ఇప్పటికే పెంచి భారం మోపారని చెబుతున్నారు. ఇంటి పన్నులు ఇప్పటికే రెండింతలు పెరిగాయని, మరల సర్వే చేసి పెంచితే పన్నులు ఎలా కట్టాలని ప్రశ్నిస్తున్నారు. కుళాయి కనెక్షన్‌లు, ఇంటి కాగితాలు చాలా సంవత్సరాల క్రితం కట్టిన రశీదులు ఇప్పుడు ఎక్కడి నుంచి తీసుకురావాలని వాపోతున్నారు. మ్యానిఫెస్టోలో కూటమి ప్రభుత్వం ఉచిత కుళాయి అని ప్రకటించిన తర్వాత అక్రమ కుళాయి కనెక్షన్‌ల మాటేమిటని ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీలో ఇప్పటికే అభివృద్ధి-సంక్షేమం అటకెక్కిందని విమర్శిస్తున్నారు.

అవినీతిలేని పాలన అవసరం

తాడిగడప మున్సిపాలిటీలో అవినీతి లేని పాలన అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అవినీతి రహిత పాలన అందిస్తే మున్సిపాలిటీ ఆదాయ వనరులు పెరుగుతాయనే అభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. కొత్తగా ఇళ్లు కట్టుకునే వారికి ప్లాన్‌లు, ఇంటి పన్నులు విధించడంలో పారదర్శకత అధికారుల్లో కనబడటం లేదని ఆరోపిస్తున్నారు. చేతులు తడపందే పనులు జరగడం లేదని, అధికారులు, రాజకీయ నేతల అండదండులు లేకుండా బిల్డర్లు అక్రమ కట్టడాలు ఎలా కడుతున్నారని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా కట్టుకున్న ఇళ్లకు పన్నులు ఇబ్బంది పెట్టకుండా విధిస్తే పన్నుల సమస్య పరిష్కారమవ్వడమే కాకుండా ఆదాయం పెరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు చేస్తున్న సమగ్ర సర్వేతో ప్రయోజనం లేదని, గతంలో కూడా సర్వే చేసి ఏమి సాధించారని మున్సిపాలిటీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

పట్టభద్రులు ఓటుహక్కు నమోదు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

ఉయ్యూరు: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు నమోదుకు అర్హులైన పట్టభద్రులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్డీఓ బీఎస్. హెలాషారోన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నవంబరు నాటికి కనీసం మూడేళ్ల ముందు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి కృష్ణాజిల్లా పరిధిలో నివాసం ఉండే పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గన్నవరం: కృష్ణా–గుంటూరు జిల్లాల్లో అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని స్వతంత్ర అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానికంగా ఉన్న పలు విద్యాసంస్థలను సోమవారం సందర్శించి పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం విద్యా రంగంలో పనిచేసిన తనకు విద్యార్థులు, ఉద్యోగులు, యువత, రైతులు, మహిళల సమస్యలపై పూర్తి అవగాహన ఉందన్నారు. ప్రజా సమస్యలే ప్రధాన ఎజెండాగా ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు ఆదంపల్లి సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే వంశీ జన్మదిన వేడుకలు



హనుమాన్‌జంక్షన్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గన్నవరం: స్థానిక రాయ్‌నగర్‌లో సోమవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ జన్మదిన వేడుకలు సోమవారం జరిగాయి. నున్న గ్రామంలోని మదర్ థెరిస్సా అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు.

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్ పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: మాజీ ఎమ్మెల్యే వంశీ జన్మదిన వేడుకలను సోమవారం హనుమాన్‌జంక్షన్‌లో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ ఆధ్వర్యంలో స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రధాన కూడలిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

మ్యాంగో మార్కెట్లో టపాసుల దుకాణాలు



మార్కెట్ పరిశీలిస్తున్న అధికారులు

నున్న(విజయవాడరూరల్): దీపావళి పండుగ సందర్భంగా టపాసుల సామగ్రి దుకాణాలను నున్న గ్రామంలోని మ్యాంగో మార్కెట్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారులు సురక్షితమైన ప్రాంతంగా ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం మ్యాంగో మార్కెట్‌ను మండల తహసీల్దారు బి. సుగుణ పరిశీలించారు. నివాసిత ప్రాంతాలకు దూరంగా, జనసంచారం తక్కువ ఉండి సురక్షితమైనదిగా మ్యాంగో మార్కెట్‌ను ఎంపిక చేసినట్లు ఆమె తెలిపారు. నున్న పోలీసు స్టేషన్ సీఐ పి. కృష్ణమోహన్, ఫైర్ ఆఫీసర్ ఎస్‌కె. గనీ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జెడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ఇరువురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు దుర్గిరాల ఝాన్సీరాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో విద్యార్థినులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన ఫెన్సింగ్(కత్తిసాము) పోటీల్లో సత్తా చాటిన మానికొండ సాయిసత్య చిన్మయ్‌ని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 22వ తేది నుంచి నంద్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో చిన్మయ్ జిల్లాకు ప్రాతినిత్యం వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా జి. లోచన అండర్–17 విభాగంలో హ్యాండ్‌బాల్, సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఇరువురు విద్యార్థినులతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు కె. గీత, జి. కృష్ణప్రియలను హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు. అలాగే స్థానిక శ్రీమల్లికార్జున హైస్కూల్ విద్యార్థి మానికొండ సాయిప్రశాంత్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డి. మాధవీలత సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

1 నుంచి టైలరింగ్‌లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో నవంబర్ 1వ తేదీ నుంచి టైలరింగ్‌లో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

గన్నవరం: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం తెలంగాణ సాయుధ పోరాటయోధులు చింతపల్లి పాపారావు సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావుతో పాటు పలువురు అమరవీరుల స్థూపాలపై ఎర్రజెండాలను ఎగురవేశారు. అనంతరం పార్టీ సీనియర్ నేత పెద్దు వెంకటరత్నం మాట్లాడుతూ.. పేదల భూమి, భుక్తి కోసం అలుపెరగని పోరాటాలు చేసిన అమరవీరుల త్యాగాలను మరువలేనివని పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి పెద్దు వాసుదేవరావు, నేతలు శనగల సుబ్బారెడ్డి, కట్టవరపు విజయరావు, వెంగళ శివయ్య, నూతక్కి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం విక్రయాలు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు బల్లెంవారి వీధి అలంకార్ బేకరి పక్కనున్న వైన్ షాపులో ఎంఆర్‌పీ ధరల కన్నా అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు మద్యం సిండికేట్‌గా ఏర్పడి ఈ దోపిడికి తెరలేపారు. అలంకార్ బేకరి పక్కనున్న మద్యం షాపును రాత్రికి రాత్రి జననివాసాల మధ్య ఏర్పాటు చేయడాన్ని ఇప్పటికే సమీప నివాసితులు వ్యతిరేకిస్తున్నారు. ఈ వివాదం జరుగుతుండగానే ఎంఆర్‌పీ కన్నా అధిక ధరలకు మద్యం విక్రయించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా డిజిటల్ చెల్లింపు చేయాలంటే ఈ వైన్స్ షాపులో ప్రత్యేకంగా టెబుల్ వేసి ఓ వ్యక్తిని కూర్చోబెడుతున్నారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఇతని వ్యక్తిగత నెంబరుకు రూ. 100కు రూ. 10ల చొప్పున ఎక్కువ వసూలు చేస్తున్నారు. రూ.1000 అనుకుంటే అదనంగా రూ. 100 వసూలు చేస్తున్నారు. దీంతో మందుబాబులకు వైన్స్ షాపు నిర్వాహకులకు వివాదం జరుగుతోంది. ఎంఆర్‌పీ ధరల కంటే అధికంగా వసూలు చేస్తున్న వైన్స్ షాపులపై సంబంధిత ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు కోరుతున్నారు.